మనిషి బావలేదు

కథకం

'గిత్తలెయ్యే! చిన్నిగాడింకా రాలేదా?' బయట్నించే పెళ్ళాన్ని కేకేసేడు వీరయ్య.

'ఎందుకట్టా కేకలేత్తావు? అప్పుడే ఏం కొంపలంటుక పోయినయనీ, గిప్పుడేగా పొద్దుగూకింది' బయటికొస్తూనే బదులు చెప్పింది చంద్రమ్మ నిర్లక్ష్యంగా. ఆమె కిది మామూలే. గిత్తలు యింటికి రాగానే వాటికి దిష్టి తీసెయ్యడం ఆమెకో దినచర్య.

'ఆడు పొయ్యేతప్పుడే పెప్పినా, పొద్దు గూకముందుకే తోలక రమ్మని. రానియ్ యెదవని. యీపు యిమానం మోత మోగాల.'

'అది సరేగాని గిత్తల్ని నాగిరెడ్డి దొరకమ్మేసినాడంటగదా. పీడా వొదిలింది. ఆయన గిప్పుడే వొచ్చిపోయిండు.'

'నేను గిత్తల్ని అమ్మినానా? ఎవుడే ఆ మాటన్నదీ? వాడి నాలుక నాలుగు ముక్కలు సేత్తా. ఏమనుకుంటున్నావో? నాగిరెడ్డిగాడు ఆడి తాత దిగొచ్చినా అమ్మేది లేదు'

'అమ్మకేం కాత్తావంట? మనకున్న నాలుక్కొండ్రల నేలకి గిత్తలు కావాలేంటి? అయినా పన్నెండొందలు యిస్తానన్నాడాయె. అంతకన్నా యీ బోడిగిత్తలకి ఎక్కువెవడిత్తాడేంటి?'

'ఒసేయ్ నోరుమూసుకో. పన్నెండొందలు గాదు పన్నెండు ఏలిచ్చినా యియ్యను. పుట్టినప్పట్నించీ కంటిపాపల్లా, కన్నకొడుకుల్లా సాకుతున్నాంగదే? యీటిని ఆ కసాయి నాయాళ్లకి కాసులకాసపడి అమ్ముకోనాలా? యెట్టిశాకీరీ అయితే సేయించుకోవడం తెల్సుగాని యీటికి కడుపునిండా తిండెయ్యడం ఆళ్లకి తెలుసునానే? శాతగాక నడవకపోతే ముల్లుగర్రతో ముడ్లుతూట్లుపడి రగతం కారేటట్టు పొడవడం, యీపులు నెత్తురు సిమ్మేటట్టు చెండకోలతో బాదడమే గదే యీళ్లు చేసేపని? చివరికి అడ్డం పడితే కాసుల కాసపడి కటికి నాయాళ్లకి కోటికి అమ్ముతారుగదే? యీళ్లకి నా గిత్తల్ని అమ్మాల్నా?' వీరయ్య ఆవేశంతో ఊగిపోతున్నాడు.

దూరంగా మువ్వల సవ్వడి వినిపించింది. వీరయ్య మొహంలో సంతోషం తాండవించింది. చూస్తుండగనే పురుకులు పరుగులమీద గిత్తలు రానే వచ్చినయ్. వెంటనే చిన్నయ్య ఉత్సాహంతో పరుగెత్తుకొచ్చేడు.

'అన్నా, అన్నా, మన ఎర్రగిత్త నాయుడి కోడెని తరిమి తరిమి కొట్టింది. మల్లిగాడు మళ్లీ నాతో పందెం ఎయ్యడు' చిన్నయ్య ఉత్సాహంగా చెప్పుకపోతున్నాడు.

వీరయ్య తమ్ముడి మాటలు వినిపించుకోలేదు కోడెదూడల కొమ్ముల కున్నమట్టి దులుపుతున్నాడు.

'ఏందిరా యిది? యీనెత్తురేంది?' ఉన్నట్టుండి కోపంతో కేకేసేడు వీరయ్య.

ఉత్సాహమంతా చప్పగా చల్లారిపోగా బిక్కమొహమేశాడు చిన్నయ్య.

'యెదవనాయాలా, గిత్తల్ని పోట్టాట పెట్టించి తమాసా సూత్తావురా?' చిన్నయ్య చేతిలోని కర్రను లాక్కొని దానితోనే ఒక్కటేసేడు వీరయ్య చిన్నయ్యను.

లబోదిబో మంటూ పదిన ప్రక్కకి పరిగెత్తేడు చిన్నయ్య. వీరయ్య వేసిన రెండో దెబ్బ అడ్డమొచ్చిన చంద్రమ్మకి తగిలింది.

'ఊరుకో. గింత గీరకపోతే బిడ్డను దొడ్డును బాదినట్టు బాదినావు నువ్వు మనిసివా ? వసువ్వా ? నీసేతులు పడి పోను...' చంద్రమ్మ శాపనార్థాలు మొదలు పెట్టింది.

'యీరవ్వా' బయట్నించి వెంకటయ్య కేకేసేడు.

'ఏందిరా నాయాలా ? మీ అయ్య పంపించిండా ?'

'జమ్మిసెట్టు సేనికాడ నాయుడు దొరని నాగుబాము కాటేసింది' వెంకటయ్య వీరయ్యమాట వినిపించుకోలేదు.

చేతిలోని కర్రతోనే బయల్దేరేడు వీరయ్య.

వాళ్ళు నాలుగిళ్ళు దాటేరో లేదో నాగిరెడ్డి ఎదురయ్యేడు. వెంకటయ్యను చూడగానే నాగుబాములా బుస్సుమన్నాడు.

'యెదవా, యిప్పటిదాకా ఎక్కడ పచ్చి వావురా ?'

'నాయుడు దొరని పాము కరిసింది దొరా. యీరన్నని తోలుకపోదామని వొచ్చినా' వెంకటయ్య బిక్కుబిక్కుగా బదులు చెప్పేడు.

'నాయున్ని పాము కరిసిందా? పావియ్య పోయినవు నాయాల్ని, పీడా వొదిలేది? అయినా ఆడితో నీకేంటిరా దోస్తీ?' రెడ్డి వెంకటయ్యని దబాయించేడు. వాడు మారు మాటాడలేదు.

ఆలస్యం సహించలేక.

'జమ్మిసెట్టు సేనికాడనన్నావు గదూ?' అంటూ బయల్దేరేడు వీరయ్య.

'అరే యీరిగా, ఆడు యిప్పుడే పొవడులే అంత తొందరగా వచ్చేవాడయితే ఎప్పుడో నాసేతుల్లోనే వచ్చేవాడు. గిత్తల్ని తోలిపెట్టి పోదువు రా' రెడ్డి వీరయ్యని పిలిచేడు.

'పొద్దున్నే సెప్పినా గద దొరా, ఆటిని వివురికీ అమ్మనని' వీరయ్య ఎక్కువగా మాట్లాడదలచుకో లేదు.

'ఏంటిరా మువ్వనేది? ఎవురమకున్నావు విన్నడిగేది? నోరుమూసుకుని తోలిపెట్టి పోదువు రా' నాగిరెడ్డికి తనమాట కాదన్నాడని కోపం ఎక్కువ కాజొచ్చింది. అసలు పొద్దున్నే సంభాషణ కోసమొచ్చేదాకా దాకా వచ్చింది.

'సెమించండి దొరా. నేనమ్మదలచుకో లేదు' వీరయ్య ముందుకు సాగిపోయేడు.

రెడ్డి వీరయ్య వెళ్ళటంచూచి తనను నిర్లక్ష్యం చేసినట్టు భావించేడు. అవమానం పొందినట్టు భావించి అన్నాడు గొంతు పెద్దదిచేసి,

'ఓరే యీరిగా, నాసంగతి తెలవదేమో నాగు కాటుకు మంత్రం వెయ్యటం నీకు వాతనవునేమోగాని యీ నాగు వగవట్టిందంటే పైసలే, ఏమనుకుంటున్నావో నాయాలా.'

వీరయ్యకి మాటలు వినిపించినవో లేదో.

* * *

ఏపుగా పెరిగిన జొన్నచేలు పిల్లగాలికి వూగుతూ వింత సవ్వడి చేస్తున్నాయి. వీపులపై మూపురాలు అటూ యిటూ ఊగుతుండగా, మెడల్లో మువ్వలు సవ్వడి చేస్తుండగా, మూతులకు చిక్కాలు తగిలించిన గిత్తలు విలాసంగా వెళ్తున్నాయి దారివెంట. జీతగాళ్ళూ, వీరయ్యా చుట్టలు కాల్చుకుంటూ ముచ్చట్లు పెట్టుకుంటూ మెల్లిగా వస్తున్నారు వెనక.

'యీరన్నా, నీ గిత్తలు రెడ్డి సేలోకి పోతన్నాయి. దొరగూడ ఉన్నాడు సేలో' వెంకటయ్య హెచ్చరించేడు.

వీరయ్య అటు చూచేసరికి గిత్తలు రెడ్డి చేలో అడుగుపెట్టడం, ఆ అదనుకోసమే ఎదురు చూస్తున్న రెడ్డిచేతిలోని ముల్లుగర్రతో ఒకదాని నెత్తిమీద బలంగా బాదడం, అది వెంటనే అడ్డంపడి గిలగిలా తన్నుకోవడం ఒక్కసారే జరిగిపోయినయి.

ఇది చూచిన వీరయ్యకు కళ్ళు బైర్లు కమ్మినయి. రక్తం ఉద్రేకంతో ఉడికిపోయింది. ఆవేశంతో వూగిపోయి, తన గిత్తను బలిగొన్న రెడ్డిమీదికి 'వాడి అంతు చూత్తాను' అంటూ ముల్లుగర్ర తీసుకుని ముందుకు కురికేడు.

అది గమనించిన రెడ్డి ప్రాణభీతితో చేనిగట్టుపై పరుగిడడం మొదలుపెట్టేడు. మిగతా వాళ్ళంతా నివ్వెరపోయి చూస్తున్నారు. వీరయ్య అంతవరకూ రెడ్డిని సమీపిస్తున్నాడు. ఇంక నాలుగంగలయి రెడ్డి దొరికి పోతాడు.

ముందు పరుగెత్తుతున్న రెడ్డి 'అమ్మా' అంటూ ఒక్కసారిగా కుప్పలా కూలిపోయేడు. వీరయ్యఎత్తిన కర్రతో ఒక్కటేసి కర్రని ప్రక్కనపారేసి రెడ్డి ప్రక్కన కూలబడ్డాడు.

ఇంతలో మిగతా వాళ్ళంతా అక్కడికొచ్చేరు. జరిగింది చూచి నివ్వెరపోయేరు. ప్రక్కన పడివుంది నల్లత్రాచు కొన ప్రాణంతో. వీరయ్య రెడ్డికి మంత్రం వేస్తున్నాడు.

మంత్రం వెయ్యడం పూర్తిచేసి—

'ఎంకటిగా అయ్యని యింటికి మోసుకపో. అమ్మతో బయం లేదని సెప్పు. రేపీ యేళదాకా అన్నం, నీళ్ళూ యేమీ యియ్యొద్దని సెప్పు??' ముల్లుగర్ర పట్టుకుని ముందుకు సాగిపోయేడు వీరయ్య.

మిగతా వాళ్ళంతా నివ్వెరపోయేరు. ●